ఆశీస్సు

చిరంజీవి కడిమిళ్ళ శ్రీరామచంద్రవరప్రసాదరావుఅను భాషాప్రవీణ తృతీయ కక్ష్యావిద్యార్థి వ్రాసియున్న పద్యశతకము నందలి పెక్కు పద్యములు వినిపింపఁగా విని యానందించితిని. విద్యాభ్యాసము పూర్తియైన నింకెంతటి రమ్య కవితఁ జెప్పఁగలఁడో యనిపించినది. ధారాశుద్ధి, శబ్దశుద్ధి మున్నగు కవిత కవశ్యమునుండఁదగ్గ సామగ్రి కలవాఁడగుటచేఁ గవితాంబర వీధిని వర్ధమాన చంద్రుఁడై కనఁబడుచున్నాఁడు. శారదాకటాక్షమున సకలాభ్యుదయములతోఁ గవితా ప్రపంచమున విరాజిల్లుఁగాత యని నా యాశీస్సు.

ఇట్లు,

విద్వత్కవిభూషణ

వెంపరాల సూర్యనారాయణశాస్త్రి

కాకినాడ, రామారావుపేట,

22-5-77

ఆశీస్సు

కడిమిళ్ళ శ్రీరామచంద్రవరప్రసాదరావు (భాషాప్రవీణ శివ సం॥) రచించిన సంగమేశ్వర శతకము నందలి పద్యములు విని యానందించితిని. అన్నియు భక్తి సంభరితములై, నిర్దుష్ట భాషాభూషితములై, భావ గంభీరములై యలరారుచున్నవి. ధార నిరర్గళమై యింపు నింపుచున్నవి. ప్రతిభావంతులు పలువురు వచన కవిత్వమునకై ప్రయత్నించుచుండు రోజులలో, నిర్దుష్టమైన గ్రాంథిక భాషలో శార్దూల మత్తేభములలో, నిట్టి హృద్యములైన పద్యములు వ్రాయుచున్న కవిని యభినందించు చున్నాను. ఈతఁడింకను రసవన్మనోజ్ఞములైన కృతులు రచించి, ఆంధ్రభాషాయోషకు నభినవాలంకృతుల నలవరించునని యాశీర్వదించుచున్నాను.

- దివాకర్ల వెంకటావధాని

హైదరాబాదు

8-6-77

ఆశీస్సు

1 శేముషీవిభవంబు సద్గురుసేవతోఁ బ్రభవించి వి
ద్యామహస్సుల సంస్కృతిన్ రసహారియై కవితావిశే
షామలంబయి శ్రీవధానవిహారమయ్యెను నీకు శ్రీ
రామచంద్రవరప్రసాద! సులక్ష్య! వర్ధిలుమెప్పుడున్

2 తతసారస్వతవైదుషీభరముగా తత్వస్ఫురన్మాధురీ
యుతిగా భక్తిసుమాంచితమ్ముగ శుభాభ్యర్థానరీతిన్ గళా
రతిమై శిష్టపథానవ్రాసిన భవద్రమ్యాత్మ కృత్యమ్మనౌ
శతకమ్మున్ దిలకించితిన్ బులకితస్వాంతుండనైతిన్ గడున్

3 అభిరతిసత్కవిత్వమున నంతయునింతయుఁగాక యెంతయున్
బ్రభుత వహించి నీమనసుపట్టునఁ గావ్యములెన్నియేని మే
ల్విభుతరబింబ శాస్త్రముల లీలలెఱింగి భవిష్యమందునన్
సభలను మెప్పుగొంచుదువు సంగమనాయక భక్తిపంటగాన్

చిరంజీవి 'కడిమిళ్ల శ్రీరామచంద్రవరప్రసాదరావు' విద్యార్థిదశయందే మంచి యభినివేశమును గలిగి యున్నాఁడు. రచించిన సంగమేశ్వర శతకమును నేనా చూడమూలముగాఁ జూచితిని. ధారావేగమునకు భక్తి ధారావేగము జతగానున్నది. శతక రచనమునకుఁ గావలసిన భావావేశముతో ... ధియు నీ గ్రంధమునఁ బుష్కలముగఁ గన్పఁ ... దాయసిద్ధమైన వీని రచనయు స్వతంత్రత ప్రశంసింపఁదగినది. ఈతఁడు మున్ముందు

కాఁగలఁడను నాశ నీ శతకము కలిగించుచున్నది. శ్రీ
యనుగ్రహము సర్వదాసర్వథా శ్రీరామరక్ష యగుగా

ఇట్లు, మధురకవి – అవధా

రావూరి వేంకటేశ్వ

ఆంధ్రగీర్వాణ విద్యాపీఠము, కొ

17

ఆశీస్సు

సంగమేశ్వర శతకములోని పద్యములు త
'శ్రీరామచంద్రవరప్రసాదరావు' స్వయము వినిపింఁగా

'ముఖే–ముఖే సరస్వతీ' అన్నమాట తరచు
యించిన రచన.

కర్తనేడు విద్యార్థియేగాని రేపు మంచి వైచక
గడించి పేరుపొందఁగలవాఁడని నా కనిపించినది. ఇత
నిరంతర వ్యవసాయము చేసి వ్యుత్పత్తిబలము సంపాదించ
ప్రతిభకు అనుగుణమైన రచనలు చేయఁగల సౌరభ
ముకుళిన దశ చెప్పక చెప్పుచున్నది.

ఆశీ

సాహిత్య సమ్రాట్ – ఆంధ్ర

పనాపంతుల సత్యనారాయణ

రా జ

2

తొలిపలుకు

ఈ రోజులలో ఆడపిల్లలనుగన్న తండ్రికి కలిగే 'సమస్య' యెట్టిదో అందరికిని తెలిసినదే. అందునా నావంటి బ్రహ్మచారికి పుట్టిన కుమార్తె విషయములో మరీచిక్కు 'సమస్య' అవధానాలలో 'సమస్య'లను పూరించుట కలవాటు పడిన నాకే యీ 'సమస్య' గడ్డు 'సమస్య'గా బయలుదేరింది. ఇంతలో నొకవ్యక్తి వచ్చి 'నేను పూరిస్తాను మీసమస్యను' అన్నారు. అప్పుడు మరియొక 'సమస్య'. చూస్తూచూస్తూ నా కుమార్తెను పిల్లలతండ్రికి ఇవ్వడమాలని. అపుడన్నది నాకుమార్తె. బ్రహ్మచారికి పుట్టిన దానిని, పిల్లలతండ్రిని చేసుకొనకూడదాఅని. అంతేకాదు ఆతనినే వరించాను. మఱి యెవ్వరినీ చేసికోనన్నది. ఇదెక్కడి 'సమస్య'యో అనుకున్నాను. ఏమిచేస్తాను. ఈ రోజులలో పిల్లల వివాహాలకు పెద్దల యిష్టాయిష్టాలతో ప్రశక్తిలేదుగా సరే కానిమ్మన్నాను. ఆతరువాత ఆడపిల్లకు తండ్రిని కనుక చాపల్యమాగక మా అల్లుడియొక్క గుణగణములను గూర్చి తెలిసికొందునా చెప్పెడిదేమి.

పవమానంబు ఘనాళి వృక్షతతి గర్వస్ఫూర్తులన్ వీడుచున్
పవమానంబునఁ దేలు ఖండములగున్ జైతన్యహీనంబులౌ
సవిశాలమ్ముఁ, ఘనమ్ముఁ, నిశ్చలత, విశ్వవ్యాప్తమై, దాతయై
వి. వి. యస్. చౌదరి వెల్గుచుండఁగ విపృథ్వీదేవతా బంధువై॥

నా యీ కృతి సుతను వివాహమాడి, నా తీరని 'సం
స్య'ను సునాయాసముగా, సరసముగా పూరించి నాకు అల్లుఁడై
దక్షిణ నాయకుఁడైన వి. వి. యస్. చౌదరి గారికి కృతజ్ఞతల
తెలియఁజేస్తూ, వయసున చిన్నవాడినే అయినను, వరుస
మామనై తిని గాన ఆశీర్వదించుచున్నాను.

మంగళపత్రికం

కవిత్వము నాకు 'భాషాప్రవీణ ఎంట్రన్స్'లో నంకురిం
నది. భాషాప్రవీణ మొదటి సంవత్సరమున నది పల్లవిం
రెండవ సంవత్సరమునందు 'అష్టావధాన' రూపముగాఁబుష్పించి
యిప్పుడు అనఁగా ఫైనల్ సంవత్సరములో శతావధాన రూ
ముగా ఫలించినది.

కవిత్వమునకుఁ దోలిబిక్షపెట్టిన ఉపద్రష్ట రామలిం
స్వామిగారికి, అవధానగురువులైన శ్రీ రావూరి వేంకటేశ్వరుల
గారికి, వ్యాకరణ సాహిత్యములను బ్రసాదించిన, పొడగట్లప
కళాశాలా ప్రధానోపన్యాసకులైన శ్రీ శ్రీపాద లక్ష్మీనారాయ
శాస్త్రిగారికిఁ, దదితరోపన్యాసకులకును నా నమస్సుమావళుల

నా రచియింపంబడిన యీ శతకము నొక సమయమ
నందుఁ బ్రమత్తతతో జారవిడచితిని. మఱియొక ప్రతి నావ
లేమింజేసి విచారించునయ్యవసరంబున మిత్రహృదయాబ్జమిత్ర

డగు నా మిత్రుఁడు సూరిశ్రీ చిట్టావూరి నన్ను ధారణచేయుటకుఁ బ్రోత్సహించి, తాను లేఖకుఁడుకాఁగఁ బ్రయత్నించి యీ శతకము నందలి రెండు పద్యములు దక్క నన్నింటిని ధారణచేసి శతకమునకుఁ బునర్జన్మ కలిగించుకొంటిని అట్టి యవకాశమొసఁగిన సూరిశ్రీ చిట్టావూరికి సర్వదా - సర్వథా కృతజ్ఞుఁడను.

భాషాప్రవీణ రెండవ సంవత్సరాంతిమ కాలమునందు నేనూహింపలేని, నా వయసుకుందగని విషమ పరిస్థితుల కారణముగా మానసిక వ్యధలకు లోనగుటఁజేసి, మద్గ్రామారాధ్య దైవమైన శ్రీ సంగమేశ్వరస్వామికి, మనశ్శాంతికైనాఁ బెట్టిన మొఱయే యీ శతకరూపమున వెలువడినది

ఈ శతకమేర్పడుటకు హేతువే మనోవేదనయో యట్టి వేదన గలుఁగఁజేసిన మఱియొక ముగ్గురు వ్యక్తులకుఁగూడ నా కృతజ్ఞతలు.


ఈశతకము రూపుదాల్చుటకు సహాయకులైన, మద్గ్రామవాసులకు తదితరులకు నా కృతజ్ఞతలు.

కడిమిళ్ల శ్రీరామచంద్రవరప్రసాదరావు,
ఏడిద.

కృతిస్వీకర్త

వి. వి. ఎస్. ఎస్. చౌదరి

కలిమిగలయింటఁబుట్టుక కలుఁగువాఁడు
పృథ్వియందుఁ గుబేరుఁడై వెలుఁగువాఁడు
కవికి గౌరవమీయఁగాఁ గలుఁగువాఁడు
వంక చౌదరి యల్లుఁడీపైన నాకు



కృతికర్త

శ్రీ కడిమిళ్ల వంశమున శేషయనామ పురోహితుండు, వా
ణీకరుణా కటాక్షమున చే పఠియించెను వేదమంత్రముల్
ఆ కమనీయమూర్తి సతియైనది బుచ్చమ. వారిపుత్రుండై
వీకునఁబాండితిన్ గొనియె వేంకటరామయశాస్త్రి వానిచే
స్వీకృతమైన భారతికి జ్యేష్ఠసుతుండ వరప్రసాదుఁడన్.

శ్రీ శ్రీ శ్రీ　　శ్రీ మాత్రేనమః　　శ్రీ శ్రీ

అవిఘ్నమస్తు

ఏమాతృమూర్తి నాకీ జీవనంబిచ్చెఁ
బదిమాసములు మోసి ప్రసవమొంది
ఏమాతృమూర్తి నాకీశక్తి నొసఁగూర్చె
దనశక్తినే పాలధారచేసి
ఏమాతృమూర్తి నాకిచ్చె విద్యాశక్తి
విద్యయే తిరమైన విత్తమంచు
ఏమాతృమూర్తి నాకిచ్చెనో కవనంబు
ఆశీస్సులేవేళ నందఁజేసి

అట్టి భారతీ దివ్యాక్షరాకరమునఁ
బరఁగుచుండెడి తల్లి నీఁ బ్రస్తుతించి
సంగమేశుని పైనేడు శతకమొకటి
వ్రాయఁగాఁ బూని కలముఁ జేఁబట్టినాఁడ.

శ్రీ గౌరీకుచకుంభలిప్త సురభి శ్రీగంధ వక్షోరమా
ోగా పక్షుడవౌచు భక్తగణముల్ పుష్పార్చనల్ సేయువో
ాగోద్దీపిత మన్మథాస్త్రముల సంరంభంబటంచెంచెదో
ఁగన్ హృత్సుమమంద మేలుకొనిరావే! సంగమేశప్రభూ!

విబింబం బుదయింప నంబరరుచి ప్రాగ్భాగమందున్ ద్విజ
షవరాత్మాబ్జ కరోత్పలంబు లడరెన్ వ్యాకోచసంకోచ సం
వనీయైక పురాణశాస్త్ర విహితధ్యానైక నిష్ఠామతిన్
వకర్తవ్య ధురీణ! మేలుకొనుమా! శ్రీ సంగమేశప్రభూ!

వందే త్వాం తవ సుప్రభాతమనుచున్ బాధాపనోదక్రియా
మందాత్మాంచిత సుప్రభాతమనుచున్ మార్తాండ తేజస్వి స
త్సందోహావన సుప్రభాతమనుచున్ శ్లాఘింపఁగా భక్తితో
ఛందస్సన్నుత! మేలుగాంచుము గిరీశా! శ్రీ సంగమేశప్రభూ!

గౌరీసంగమ సౌఖ్యవైభవము భగంబంచు భావించెదో
నీ రేజారిధరా! నిశీథమనిగాని నీవు భావించెదో
ధారాపాత తరంగమర్ఘ్యము సముద్దంబంచు భావించెదో
శ్రీరాజిల్లెడు వేళ మేలుకొనుమా! శ్రీ సంగమేశప్రభూ!

బారుల్ దీర్చిరి వందిమాగధులు కైవారంబులం జేయ నా
ట్యారంభంబును జేయనుండిరిట రంభాద్యప్సరో భామినుల్
శ్రీరాజిల్ల ప్రభాతలక్ష్మి నిలిచెన్ సేవింపఁగా నెంచి నీ
గౌరిన్ గౌగిలివీడి మేలుకొను వేగన్ సంగమేశప్రభూ!

కమలంబుల్ వికసింప వేదములునిన్ గానంబులన్ జేయఁగా
నమలోదాత్త యతీసులంబునినున్ బ్రార్థింపగా భామినుల్
సుమమాలాగతహస్తలై మనమునన్ శ్లోకింపఁగా సూర్యుఁ
విమలుండై వెలుగొంద మేలుకొనిరావే సంగమేశప్రభూ!

ఇతరుల్ మెచ్చఁగఁగాదు పండితులచే నీమత్ప్రశంశంబు నం
దు తలంపన్ననుగాదు వంచనలచే దుఃఖించుచున్నట్టి దు
ర్గతినింబాసి మనంబు శాంతిలుటకై ఘటంబుచేఁబూని నే
శతకంబియ్యది వ్రాయఁబూనితిని యీశా! సంగమేశప్రభూ!

గ్రామంబేడిద తత్సమీపమున యజ్ఞంబొందు సంఘంబు శా
స్త్రామోదంబున సల్పఁగానచటఁ బ్రత్యక్షంబుఁగా నెంచి వా
ణీమాభర్తలు నూర్ధ్వయానమున రా, సీరాకఁగావింపఁగా
భూమధ్యంబునఁగొంటి విట్టి బిరుదంబున్ సంగమేశప్రభూ!

శ్రీవాణీ విభుసేవితస్వచరణా! శ్రీరామలింగేశ్వరా!
శ్రీవిద్వత్కవిశేఖరాదివినుతా! శ్రీశైలవాసా! హరా!
భావోద్రేకము కల్గజేసి పదముల్ భాసింపఁగాఁజేసి నా
కావేగంబు కవిత్వమీయఁగదవయ్యా! సంగమేశప్రభూ!

నటదుత్తుంగ తరంగ జృంభణాస్ఫూర్తి నాట్యాభిలాషామతిన్
జటలన్ గంగనునిల్పి నీవు నటరాజస్థానమున్ గొంటివో!
నటదుత్థాన పద్మాబ్జయుక్త గిరిజానాథుండవై యుండుటన్
నటరాజత్వము గొంటివో! భరతవంశ్యా! సంగమేశప్రభూ

హృదయంబేయొక మందిరంబనుచు భావింపంగ శ్రీనైతి నా
పదముల్ రత్నములంచు నెంచునెడ సర్వశ్రేష్ఠమైనైతి సం
ఘదురూహాన్ జను బాష్పతోయ మభిషేకంబైన నాగంబ నె
వ్విధిచేనైనఁ గటాక్షమీఁగుటకు రావే! సంగమేశప్రభూ!

హృదయంబేయొక సేత్రమైన నదినీదేయైన నాపైన నా
హృదయంబున్ ధరియించు కాయమిది నీదేయైనఁ గన్నుండలోఁ
గదలాడన్ మదిఁ గౌగిలించుకొన మార్కండేయుఁడన్ నేను నె
వ్విధిచేనైనఁ గటాక్షమీఁగుటకు రావే! సంగమేశప్రభూ

సుమముల్ దెచ్చెదనన్న పదముల్ శోభిల్లుసజ్జంబులై
యమితోత్సాహముసేసి యర్ఘ్యమిడుచో హాస్యంబుగంగాధరా!
విమలంబౌ మకరందమీయ షధుఁడేవేళన్ సుధామూర్తియే
ప్రమథాధీశ! మఱెట్లుసల్పుదును సేవన్ సంగమేశప్రభూ

విధుఁడాకాశమునందు వెల్గునపుడే వేధించుసంచెంచి య
వ్విధు నెవ్వేళను దూరుచుందు విమదనోద్వేగుల్ ప్రజల్ నీవు నె
వ్విధిలోనుంటివి చంద్రమౌళి చెప్పుమా! వేధింపఁగా నర్థ మి
చ్చెదవో కాయమునందు గౌరికొలఁకై శ్రీసంగమేశప్రభూ!

నిను సేవించెదనన్న నల్పమతినై నీమూర్తినింగాంచు వాఁ
డను గానైతినుతింతునన్నను నిగూఢంబైన నీతత్త్వమా
వనజాతోద్భవుఁడే యెఱుంగడు కవిత్వస్ఫూర్తి మెప్పింతు నం
చునుచోఁ దద్రసపుష్టి లేదయినదయ్యా! సంగమేశప్రభూ!

కవనార్థంబుదయించితిన్ సుకవితాకార్యంబు నావృత్తి యం
చు వచించెన్ గవి చెళ్ళపిళ్ళమఱి నా సుజ్ఞానమేపాటి నే
ను వచింపన్ వచియింపలేను మఱినన్నున్ బ్రోచినన్నీవు స
త్కవినై కావ్యమునల్లఁగాఁగలను వీకన్ సంగమేశప్రభూ!

కవులైపుట్టఁగనేల! గౌరవములా కాకున్న విత్తంబులా!
కవిశ్రీనాథుఁడు సౌఖ్యమేమివడసెన్ గాలావసానంబునన్
కవిపోతన్నయు దుర్గతిన్ బడయడే కారాదటంచందురా
కవి విఖ్యాతి గ్రహింపరీనరులు లెక్కన్ సంగమేశప్రభూ!

కవితావాసన పూర్వజన్మఫలమై కామించు వ్యుత్పత్తి సం
భవమౌ సంచరణన్ శ్రమించి పఠనాభ్యాసంబు గావించుచోఁ
గవియై, సత్కవియై మహాకవియునై కావ్యప్రపంచంబునన్
శివసంధాయకుఁడంచుఁ గీర్తిఁగొనడే శ్రీసంగమేశప్రభూ!

కవితాశక్తి గ్రహింపలేని కుజనుల్ కాదంచునోనాడినన్
కవులన్ డాగినశక్తిడిగ్గునగదా! కాలప్రవాహంబు సం
దెవరైనన్ గ్రహియించిమెచ్చఁదగరే సృష్టిన్ రసాభిజ్ఞులై
యెవరోయొక్కరు మెచ్చ ధన్యుఁడగుఁగాదే సంగమేశప్రభూ!

గణముల్ కూర్చుటనేర్చి, ప్రాసకొఱకై కాలంబువెచ్చించి, భో
జనపానాదుల విస్మరించి, యతికైశక్తిన్ సమర్పించి, చెం
తను గోశంబులనుంచి గ్రాంథికకవిత్వంబంచు భావించి, వ్రా
సినచోనేమి ఫలంబు వాఁడు గవియా శ్రీసంగమేశప్రభూ!

గో నాలుగు పద్యముల్ చదువుటే మేధాబలంబంచు దు
లై విజ్ఞులదూరుచుందురుగదా! మార్తాండ తేజస్సమ
భాశక్తి సమీపమందు నరివర్గంబుండదే కేతకీ
లన్ సర్పముడాగినట్లు కవివంద్యా! సంగమేశప్రభూ!

త్రాశక్తియుఁ గోలుపోవదిక శ్లాఘ్యంబౌను నానాటికిన్
ధానంబునఁ బ్రజ్ఞడిగ్గదు ప్రశంసార్హంబుఁగా మారు వి
వివేకమ్మును గుర్తింగఁ బోవదిక హృద్యంబౌనుమున్ముందటన్
సదాశీస్సుల నెల్ల వేళలను బ్రోవన్ సంగమేశప్రభూ!

వినై పుట్టఁగ జన్మజన్మలకు విఖ్యాతిన్ సమార్జింపఁగా
వధానంబును సల్పఁగా బుధులు హృద్యంబంచు భావింపఁగా
వచోధీరతనొందఁగా నను సుధీసుండంచు భావింపఁగా
ఘనదాశీస్సులనిచ్చి బ్రోవుటకు రావా! సంగమేశప్రభూ!

చదువుల్ నేర్చుచున్నవాడనని యీర్ష్యాద్వేషముల్ బూని యే
బుధవర్గప్రతిపక్ష కోటి చెడుగుల్ ప్రోత్సాహముల్ సేసినన్
గదనంబందున నాయుధంబనెడు జ్ఞానంబున్ బ్రసాదించి నా
చదువున్ వర్ధిల జేయుమయ్య పరమేశా! సంగమేశప్రభూ!

వ్యసనంబన్నిటఁ బాఱద్రోలి యొకవిద్యాభ్యాసమందిమ్ము నీ
రసమున్ బాపుము కార్యమందునఁగు కార్యంబందునందక్క శా
స్త్ర పరస్వాంతము నీదఁగాఁదగిన ధీరత్వంబు జ్ఞానంబు నా
శముంజేయుము ప్రార్థనల్విన్నము దేవా! సంగమేశప్రభూ!

విద్యావృద్ధినిఁబొందఁగాఁ గృషికి నేవేళన్ బ్రయత్నించెదః
హృద్యంబౌ కవనంబుసల్లుటకు నేనే వేళయత్నించెదన్
చోద్యంబంచన మద్వధానప్రతిభన్ జూపింపయత్నించెదన్
విద్యానాథ! కటాక్షమీయ నిడరావే సంగమేశప్రభూ!

శివరూపాయ! శివప్రదాయ! ధిషణాస్నిద్ధ ప్రకర్షాయ శ్రీ
స్తవనీయాయ! కవీశ్వరాయ! గిరిజాసమ్మిశ్రరూపాయ స
త్కవిరూపాయ! కవిస్తుతాయ! బుధవిఖ్యాతాయ శర్వాయ
త్రివిశేషాయ! నమశ్శివాయ యన, రారా సంగమేశప్రభూ!

సమయోత్పన్న సదాసుశిష్ట కవితాసామ్రాజ్యపట్టాభిషే
కమహోత్సేక మహోత్సవాంచిత నిరాఘాట ప్రమోదాదు
భ్రమవిచ్ఛేదక కర్ణపేయరచనా పాండిత్య సమ్మిశ్రభా
వ మదాయత్తవధానశక్తి నిడరావా! సంగమేశప్రభూ!

నిష్ఠాభ్రష్టవివేచనారహిత దుర్నిక్షేప చేష్టా పరా
కాష్ఠా ప్రాభవకశ్మలార్ద్రిజన నిష్కారుణ్యకంథా మనో
నిష్ఠాతాఖిల శిష్టభక్తజనహృన్నిరేజ బంధుండవై
శ్రేష్ఠుల్ శిష్టులునైనవారిగనుమా! శ్రీ సంగమేశప్రభూ!

శ్రీరామార్చిత పాదపీఠవరదా శ్రీరామలింగేశ్వరా!
గౌరీసుందర! శంకరా హరహర గంగాధరా! ఈశ్వరా!
కారుణ్యామృతపూరితా! బుధనుతా! కైలాసవాసాహరా!
చేరన్ జాగున్న దేలఁ జేయుడవయా! శ్రీ సంగమేశప్రభూ!

బలియే మాయెను కర్ణుఁడేమిగనె సర్వస్వంబుఁ గోల్పోయి
బా; ధలపాలౌదురు గానసీవసుధలో దానంబు పాపంబు దా
తలు గారాదనుచుందురజ్ఞ మతులై తత్కార్యసంభూత ని
శ్చలసంతోష మెరుఁగ లేక పరమేశా! సంగమేశప్రభూ!

ఏమీ శాస్త్రము లేమి ధర్మములివేమీ వేదముల్ చెప్పమా!
ఏమీ తేవనుచుందురజ్ఞ మతులై యేమందుఁ బ్రారబ్దమో
యేమో! యేమవుఁగాక భక్తులకుఁ బోనేపోవు విశ్వాసముల్
ఏమాజంగము శ్వాసముల్ యిఁకఁగఁ బోనీ సంగమేశప్రభూ!

ప్రణుతింతున్ బ్రణుతింతు నిన్నుఁ బ్రణుతింపన్ జ్ఞానమే పాటియం
చను మానింపకు మెంత వృషమగునో యంతేగదా మారుతం
బను సూక్తిన్ మది విస్మరింపకుముసుమ్మా జ్ఞానమున్నంతలో
బ్రణుతింతున్ బ్రణుతింతు నెల్లపుడు దేవా! సంగమేశప్రభూ!

అంభోరాశిఁ ద్రికాలమున్ మునిఁగి సంధ్యావందనార్థంబు నే
గంభీరంబుఁగ మంత్రముల్ చదువ శుష్కంబైన నాకాయ మా
ంభింపన్ వెనుకాడు వేదమును నేర్వన్ లేదు నా జిహ్వ హే
ంభో యంచుఁ దలంచువాఁడను సురేశా! సంగమేశప్రభూ!

వలీలామృతమాధురీ మహిమ నే సేవింతు నే వేళలన్
వలీలామృతమాధురీ మహిమచేఁ జేకొందు విద్యారతిన్
వలీలామృతమాధురీ మహిమచేఁ జేకొందు జ్ఞానప్రభన్
వలీలామృత మే శుభప్రదమగున్ శ్రీసంగమేశప్రభూ!

మనసే మందిరమంచునెంచి కవితా మాధుర్యమే యంబరం
బని భావించి రసోత్సవంబులను నీ కర్తవ్యంబుగానెంచి భా
వన నైవేద్యమటంచు వృత్తములనే స్వర్ణ ప్రభాభాస వా
హన రాజంబులటంచు నెంచుకొనుమయ్యా! సంగమేశప్రభూ!

సిరులేసృష్టికి మూలకారణముఁగాఁ జింతింతురజ్ఞానులై
సిరులేముక్తికి మూలకారణముఁగా సేవింతురేతీర్థముల్
సిరులన్ గామ్యముబొందనెంచి వ్రతముల్ సేయింతురే యజ్ఞులై
సిరిలేకున్నను దర్శనంబు కలవా! శ్రీ సంగమేశప్రభూ!

జటలందెయ్యది చందమామకు నివాసంబై ప్రకాశించెనో
జటలందెయ్యది యభ్రగంగకు నివాసంబై ప్రకాశించెనో
జటలందెయ్యది దుష్టదక్షునకు శిక్షాప్రాప్తి గావించెనో
జటనద్దానినిఁగాంచనిమ్ము పరమేశా! సంగమేశప్రభూ!

వదనంబెయ్యది వ్యాళరత్నరుచులన్ భాసించు లోకంబులన్
వదనంబెయ్యది శాంతిభూషణములన్ భాసించు శిష్టాత్మలన్
వదనంబెయ్యది జ్ఞానపూర్ణఖనియై భాసించు విద్వాంసులన్
వదనంబయ్యది యొక్కమాఱుగననీవా! సంగమేశప్రభూ!

కంఠంబెయ్యది శ్రీనివాసమగుచున్ గాపాడె బ్రహ్మాండమున్
కంఠంబెయ్యది శ్రీధరంబులకు విఖ్యాతి ప్రదంబైనదో
కంఠంబెయ్యది శ్రీవిరాజమగు శంఖఖ్యాతినింగొన్నదో
కంఠంబయ్యది గాంచనిమ్ము సుయశస్కా సంగమేశప్రభూ!

వక్షంబెయ్యది గౌరితృప్తిఁబడయన్ బాలిండ్ల మర్దించునో
వక్షంబెయ్యది కుంభలేపనములన్ భాసించునో శ్వేతమై
వక్షంబెయ్యది భద్రకుంభకుచముల్ బాధింపఁగాఠిన్యమా
వక్షంబయ్యది యొక్కమారుగననీవా! సంగమేశప్రభూ!

పాదాబ్జద్వయమేది పండితమనోవాసంబుగానున్నదో
పాదాబ్జద్వయమేది సత్కవి మనోవాసంబుగానున్నదో
పాదాబ్జద్వయమేది నిర్జర మనోవాసంబుగానున్నదో
పాదాబ్జద్వయ మట్టిదానిఁగననీవా! సంగమేశప్రభూ!

పాదాబ్జద్వయమేది జ్ఞాననిధి సంప్రాప్తంబు గావించునో
పాదాబ్జద్వయమేది సత్కవన సంప్రాప్తంబు గావించునో
పాదాబ్జద్వయమేది మోక్షపద సంప్రాప్తంబుగావించునో
పాదాబ్జద్వయమట్టి దానిఁగననీవా! సంగమేశప్రభూ!

కారుణ్యంబదియేది యారతికి మాంగల్యంబు గాపాడెనో
కారుణ్యంబదియేది భక్తుఁడగు మార్కండేయునిఁ గాచెనో
కారుణ్యంబదియేది మత్తకరికిం గైలాసమందిచ్చెనో
కారుణ్యంబది పూనుమయ్య సుయశస్కా! సంగమేశప్రభూ!

జ్ఞానంబేమిగడించె శ్రీయపుడు నీ సాన్నిధ్యమున్ జేరదే
జ్ఞానంబేమిగడించెఁ గాళమదినీ సాన్నిధ్యమున్ జేరదే
జ్ఞానంబేమిగడించె మత్తకరి నీ సాన్నిధ్యమున్ జేరదే
జ్ఞానంబేలకో! భక్తియున్నఁబరమేశా! సంగమేశప్రభూ!

హస్తంబెయ్యది హస్తిఁగాచినదియో యాశీస్సులందీయఁగా
హస్తంబెయ్యది చిహ్నమానొ రచనావ్యాసంగముం జేయఁగా
హస్తంబెయ్యది శిష్టభావుక ప్రజాహస్తంబులన్ బన్నునో
హస్తంబయ్యది గాంచనీయగదటయ్యా! సంగమేశ ప్రభూ!

వేదాభ్యాసకులందఱిన్ జనులఁగావించెన్ గదా కావ్యముల్
వేదార్థంబు నెఱుంగ ఛాందసులులఁ గావించెన్ గదా లోకముల్
వేదంబున్ బఠియింపలేదు మఱినే వేదార్థమున్ నేర్వలే
దేదీ! యేబిఱుదంబు నాకుఁదగునేదీ! సంగమేశప్రభూ

భగవంతుం డెవడంచుఁ జూపుమనుచున్ వాదింతురజ్ఞానులై
జగమేరీతిని సంభవించెనెటులన్ సంప్రాప్తమాజన్మముల్
సిగలోఁ జాఁబిలిదాచి గంగనటవాసిం జేసి యున్నాడవే
యగుపించంగదె! యట్టిరీతి కవివంద్యా! సంగమేశప్రభూ!

దయఁజూపింపఁగ రాదటయ్య సతతధ్యానైక నిష్ఠుండ నా
శ్రయమున్ జూపఁగరాదటయ్య చరణాబ్జస్థానపీఠంబుపై
ప్రియమున్ జూపఁగరాదటయ్య తగుధీవృద్ధిన్ బ్రసాదింపఁగ
హాయువేగంబు కవిత్వమీయగదటయ్యా! సంగమేశప్రభూ

మీనాక్షీమధురాధరామృత వశంబేగాను నీ చిత్తమున్
ధ్యానాసక్త ప్రజాధరామృతవచో హంకారమందుంచుమా!
నీ నామస్మరణంబుచేయు ప్రజలన్ నీ పుత్రులన్ బ్రోవఁగా
శ్రీనాథస్తుత! ప్రార్థనంబువినుమా! శ్రీ సంగమేశప్రభూ!

శబ్దాశబ్ద వివేచనారహిత విజ్ఞానంబుతోనుంటి ప్రా
రబ్ధంబౌనిది నీకు నీ పయినినే గ్రంథంబులన్ వ్రాయ ని
శ్శబ్దంబౌ మతియందునన్ ధ్వనుల విజ్ఞానంబె? యుష్మత్కటా
క్షాబ్ధిన్ ముంపఁగ నీకు నౌదుఁ బరమేశా! సంగమేశప్రభూ!

కంఠేకాల! మరొక్క మాటవినుమా! గ్రంథంబులన్ బెక్కిటిన్
గంఠస్థంబును జేయకున్నకతనన్ స్ఖాలిత్యమైయున్నదో
కంఠేరుండను స్వర్ణపూజసలుపంగా లేను కాపాడి మ
చ్ఛుంఠత్వమ్మును బాపి. చేయుము సుధీశున్ సంగమేశప్రభూ!

నగ్నాసత్య శరీరమోహజనితోన్మాదార్ణ వాంతిర్య ని
ర్మగ్న ప్రాభవ దుష్క్రియాకలన నిర్మాలిన్య హీనాత్మ స
ల్లగ్నాధః కృతమానవాభ్యుదయ కార్యస్ఫూర్తి భూమాత తా
భగ్నప్రేమిక పుత్రహీనయగు దేవా! సంగమేశప్రభూ!

ధనమూలంబు జగత్తు తద్ధనమె విద్యావృద్ధిఁ గల్గించు; త
ద్ధనమే గౌరవమిచ్చు దద్ధనమె సత్సౌఖ్యప్రదంబైనదే
ధనమున్ బొందనివారి జీవనము వ్యర్థంబంచు భావింతురే
ధనహీనాత్మకసృష్టి మానుకొనరాదా! సంగమేశప్రభూ!

నిను సేవించినదంచు నెంచి దయతో నీవస్త్రమున్ జేసి హ
స్తినిఁ గైవల్యమొసంగి, ప్రోచితివి నిన్ సేవింప రత్నంబులన్
ఫణిదోర్దండ మొసంగి ప్రోచితివి యేప్రారబ్ధమా శ్రీకి కి
మ్మనకన్ జెంతను జేర్చుకుంటి గదటయ్యా! సంగమేశప్రభూ!

ఎవఁడో సృష్టికి మూలకారకుఁడు వేఱెవ్వాఁడు సంరక్షకుం
డెవఁడో సృష్టికి నాశకారకుఁడు వేఱెవ్వాఁడు సర్వాత్మకుం
డెవఁడో రూపము లేనివాఁడు మఱియుం కెవ్వాఁడు సర్వోత్తము
డెవఁడో జ్ఞాననిధీశ్వరుండతఁడ వీవే సంగమేశప్రభూ!

అలనన్నయ్యయు శబ్దశాసన యశోహంకారుఁడున్ సోమన
జులు, సచ్ఛిల్పధురీణుఁడెఱ్ఱనయు సత్సూక్తిప్రదుండింకపై
కలయం దైనను గోచరింపరుగదా కావ్యాంగనానాథులై
వలపున్ దీర్చెడువారు లేరుగద! దేవా! సంగమేశప్రభూ!

సిరియాళుండలనాడు నిన్ను మిగులన్ సేవించు పుణ్యంబుకా
నరమాంసంబును గోరినాఁడవట నీ నామార్చనల్ సల్పి నీ
చరణంబే శరణంబటంచును భవత్సాన్నిధ్యమున్ గోరుచో
వరమా! యయ్యది భక్తవత్సలుఁడవీవా! సంగమేశప్రభూ!

లోకంబా! యిది కాదుకాదు కలుషక్రోధాంతరంగంబు నా
పై కోపంబును బూని తీక్ష్ణముఁగ నన్వంచింప రాకుంటివే
నీకేమాత్రము జాలియున్నఁగనవే నిర్దోషిపై నిందలన్
ఆకాత్యాయనిఁగూడి కల్కసమయంబా! సంగమేశప్రభూ!

శ్రీబుద్ధిఃప్రళాయంతకమ్మనెడు సూక్తిన్నమ్మఁగాలేక నేఁ
బూఁబోఁడిన్ దరిఁజేర్చి సోదరినిఁగాఁ బూర్వానుబంధంబుగ
నీబాలున్ గరుణించియిచ్చిన వరంబేయంచు భావించుటే
యేఁబాపంబును జేయుటానో యిదియేమిా సంగమేశప్రభూ

ఏపాపంబును జేయకుంటినిగదా! యీవేళ నీబాధలన్
గూపంబందునఁగూలి పోయితిఁగటా! కూలంగ నెవ్వారలీ
పాపంబందునఁ బాత్రధారులయిరో వారందఱిన్ శ్రీఘనా
పాపంబందునఁగూలఁద్రోయుటను రావా! సంగమేశప్రభూ!

స్నిగ్ధంబొందినరీతి నేటివనితల్ సింగారమున్ జూప స
మ్ముగ్ధుండై తనసంస్కృతిన్ విడిచి తన్మోహాబ్ధిలోఁగ్రుంకి సం
దిగ్ధంబొందక యవ్విలాసమొకటే దీక్షైప్రవర్తిల్లఁ జే
దగ్ధంబైనవి సంస్కృతుల్ విబుధవంద్యా! సంగమేశప్రభూ!

పలుకుల్ నేర్చినవారు మానవులు దుర్భాషల్ దురుద్దేశ్యులై
పలుకంజొచ్చిరి వంచనార్థములచే బాధింపనెవ్వారిలో
విలపింతున్ మొఱలాలకించుటకు నే వేల్పున్ బ్రశంసింతు నీ
శిలరూపంబు త్యజించి ప్రోవగదవే శ్రీ సంగమేశప్రభూ!

నీవేవచ్చిన సత్యమేపలికినన్ నిక్కంబుగాదంచుఁ దా
మేవోసాకులఁ ద్రోసిపుచ్చి పదునాఱేండ్లున్న భామామణుల్
గ్రావంబొక్కటిఁజూపి నాగమనినన్ గాబోలటంచంకురీ
స్త్రీవేషంబవివేకహేతువుగదా! శ్రీ సంగమేశప్రభూ!

అలనాడా రతికుంకుమన్ జెరుపుటేనా నీకు వీరత్వమున్
బలమున్ బంచశరుండుగాడు ప్రతిభావంతుండు భూలోకవా
సులునారీజనముల్ విషార్ద్రిమగునాచూడ్కుల్ ప్రభావంతముల్
బలమేపాటిది చూచువాడనిక దేవా వచ్చి యివ్వారి చూ
డ్కులదప్పించుక దాటిపోగలవటొక్కొ! సంగమేశప్రభూ!

కరుణన్ నిర్జరకోటి శాంతికొఱకైకాదే ప్రభూతాగ్నియౌ
గరళంబయ్యెడ మ్రింగినాడననియా గర్వంబుకాఁబోవదీ
తరుణీవాక్కులయందునుండు విషమున్ దగ్గించినంజాలునీ
బిరుదుల్ గానఁగవచ్చులోక మిఁకరావే సంగమేశప్రభూ!

బాలప్రాయమునందు వృద్ధునయితిన్ వాటిల్లెనే దుర్గతుల్
ఏలా! నాపయిఁగోపమూనితివి నేనేపాపమున్ జేసితిన్
కైలాసంబునఁబూలపాన్పుపయి నీ కాత్యాయనింగూడి నా
యాలాపంబుల నాలకింపవుగదయ్యా! సంగమేశప్రభూ!

బాలుండొక్కఁడు పాహిమామనుచు నిన్ బ్రార్థింప రాకుంటివే
కైలాసంబున నాట్యమున్ సలుపుచున్ గంధర్వులర్చింప గా
నాలాపంబును జేయఁగా నటసుఖంబానంద మందుండ నీ
బాలుండెక్కడి జ్ఞప్తినీకగును బ్రోవన్ సంగమేశప్రభూ!

నన్నే నిందల పాలుచేసినను నా నాశంబునేగోరి న
న్నెన్నోరీతులఁ దూలనాడినను నీవేలా! యుపేక్షింతువో
ఎన్నాళ్ళైనను గాంచకుందువసలీ వేమైతి నేత్రత్రయం
బున్నన్ నిష్ఫలమాయెనేమొ కనుకేమో! సంగమేశప్రభూ!

గ్రహపాటో! పొరపాటో! పాపఫలమో కాకున్నమూఢత్వమో
సహవాసంబనుదోషమో! మనసుకీవన్మాత్రమున్ బట్టదే
అహహారా! కడునీచులన్ హితులుగా నాశించుటే హేతువో
గ్రహణంబందు విధుండనైతిఁ గనరారా! సంగమేశప్రభూ!

సహనంబొక్కటి లేనివారికి మనశ్శాంతిన్ ప్రసాదింప నా
తుహినాంశుండను వృద్ధుఁడైననుచుఁ బ్రాదుర్భావమున్ జెందు ప్ర
త్యహమున్ భూనరకంబటంచెఱిఁగి నాయావేశమున్ నెట్టితిన్
సహవాసంబిది దోషమాయెఁ బరమేశా! సంగమేశప్రభూ!

అవివేకంబది చుట్టుముట్టి భగవద్ధ్యానంబు క్షీణించె లో
క వినాశంబిక దాపురించెఁ బరమోత్కర్షంబు లోపించుటన్
సువిశాలంబగు భారతాంబయెదయే శుష్కించె జాగేలనీ
యవివేకంబును బాఱఁద్రోలగదటయ్యా! సంగమేశప్రభూ!

అతిరూపాన్వితయౌట రాముసతి దైత్యశ్రేష్ఠుకున్ జిక్కదే
అతిదానాన్వితశీలుఁడౌట బలి రాజ్యభ్రష్టుఁడైపోవడే
అతిమిత్రత్వమునొంది నేనిపుడు దుఃఖాంభోధిలోఁ గ్రుంకితిన్
అతిసర్వత్రయు వర్జనీయమగునయ్యా! సంగమేశప్రభూ!

ఇతరుల్ మెచ్చరు బంధువుల్ దలఁపరే యేనమ్మికొన్నట్టి స్నే
హితులే నమ్మరు వంచనార్థములతో హింసించుచున్నట్టి దు
ర్మతులన్ ద్రుంపఁద్రిశూలి పూనుకొనిరారా! భీకరాధూర్జటీ!
జితదుష్టారి సమూహుఁజేయఁగదవే శ్రీ సంగమేశప్రభూ

చదువుల్ పెంచెదవంచునెంచితిని నాసంపత్తి నీవంచు నా
మదిలో దాగెదవంచునెంచితిని యున్మత్తుండనై ధూర్జటీ!
హృదయంబన్నదియున్నదా! కరుణవాసింపంగఁజోటున్నదా!
ఇదినీ నైజమ! కాదు నైచ్యమగునోయీ! సంగమేశప్రభూ!

భువనంబెల్లనుగాచినావట విషంబున్ గంఠమందుంచి న
న్నవమానంబుల పాలుచేసిరిట నా యారాధ్యులాప్తప్రజల్
ఇవినీ దృష్టికిరావు మంచికికలేనేలేదు తావిచ్చటన్
భువనం బేలకుఁగాచి, చేసితివఘమ్మున్ సంగమేశప్రభూ!

కనులున్నన్ గనరాదు సత్యమును లోకంబంచుఁగన్నీటిలోఁ
గనులన్ క్షాళనచేసికొంటి నదియాకన్దోయినేగాని నా
మనమున్ క్షాళనచేయదాయె సుఖమేమాత్రంబు గల్గింపదే
మని ప్రార్థింతును దుఃఖపూరితుఁడసుమ్మా సంగమేశప్రభూ!

ఏమైపోతివో యిన్నినాండ్లు కనరావే దీనదుఃఖాంబువుల్
ఏమైపోతివో యిన్నినాండ్లు వినరావే యార్తనాదంబులన్
మోమాటంబులుమాని మిత్రజనముల్ మోసమ్ముగావింప నీ
కేమాత్రంబును బట్టదాయెనుగదోయీ సంగమేశప్రభూ!

సంతోషించినవాడవో మదియికన్ శాంతంబుగానున్నదో
చింతావార్ధినిమగ్నునన్నుఁగని నిశ్చింతా సముద్రంబునన్
శాంతస్వాంతుఁడవౌచు నవ్వుకొనెదో సచ్చిత్తునైయున్న నా
కెంతో మేలిది చాలుచాలునగుమోయీ! సంగమేశప్రభూ!

రవినాపాలిటిసాక్షి దోషమణుమాత్రంబైన నేఁజేయలే
దివినిక్కంబుఁగ నిందలేయనుచు నేనేరీతి ప్రార్థించినన్
భువియందెవ్వరు నమ్మరైరి దివియే పుణ్యాలతావందు రే
దివియందుంటివిగాన నమ్మఁగలవో దీనప్రజన్ జూతువో
శివమున్ గూర్తువో! సౌఖ్యమీయఁగలవో! శ్రీసంగమేశప్రభూ!

ఉన్నావా! యనికొందఱంద్రు మఱినీవున్నన్ గటాక్షింపవే
ఎన్నాళ్ళైననటంచుఁ బల్కుదురు నీవేయున్న నేత్రత్రయం
బున్నన్ గాంచవదేలయంద్రు మఱి నీవున్నావటంచెంచు నా
కన్నీ రెన్నటికేంకఁ జేసెదుగడంకన్ సంగమేశప్రభూ!

రారా! చండప్రచండతాండవ సమారంభక్రియాభీకరా!
రారా! ఘూర్వ్యాహా! కేశవంచితసతీ ప్రాణాంతకా! ఘూర్జటీ
రారా! నేత్రజితాంగజాద్భుతశరీరా! పార్వతీవల్లభా!
రారా! రుద్రుఁడ! దుష్టశిక్షణకు రారా! సంగమేశప్రభూ!

నేనీనాడొక నష్టజాతకుఁడనై నీ భక్తవర్యుండనై
నీ నామావళినే స్మరించుకొనుచే నేఁజేయుపాపంబొ నీ
వేనాడైనను నన్నుఁజూచుకొనుచో నీభాగ్యమిట్లుండునా!
ధీనాధేశ్వర! చిత్తశాంతినిడరాదే! సంగమేశప్రభూ!

అనురాగామృతపూరితంబు హృదయంబాకాశనీకాశ సా
ధనివాసంబు తిరంబుసేసికొనెనే తత్సౌధమాకాశమే
మను సత్యంబు గ్రహింపదాయెనుగదా! యాబేల కేలీల శా
నమున్ జేసెద నాశవీడుమని యీశా! సంగమేశప్రభూ!

లయందే తెలవారిపోవు కథనే కావ్యంబుఁగాఁజేసి పా
తలఁజిత్రించుచు నన్ను నాయకునిఁగా వ్రాసెన్ లలాటంబు పై
లచెన్ గావ్యమునంతులేని కథగా మచ్ఛత్రువౌధాతనీ
లరూపంబు త్యజింపవీవు నకటా! శ్రీసంగమేశప్రభూ!

అంతా మిధ్య జగంబుమిధ్య సుఖమందానందమా! మిధ్య ని
శ్చింతౌ మిధ్య సచింతమిధ్య జనితశ్రీమిధ్య; కష్టంబులన్
సంతాపంబని మిధ్య మిధ్యగద యీసర్వంబు నింకేల నే
చింతావార్థి నిమగ్నుఁడీవు మనసా! చేఁబట్టుమా ధైర్యమా
చింతన్ వీడుమటంచుఁ బల్క వినదే శ్రీ సంగమేశప్రభూ!

అసలీ జన్మము నేలనిచ్చితివి నిన్నర్థించి యున్నాడనా!
పసులన్ మిత్రుల నేలఁ జేసితివి నిన్ ప్రార్థించియున్నాడనా
బుసలన్ గొట్టక కాటు వేయు ఫణముల్ పూఁబోఁడులే యంచు దు
ర్దశలన్ బొందక పూర్వమే తెలుపరాదా! సంగమేశప్రభూ!

నేనీనాఁడొక వెఱ్ఱిషట్పదిని పోనేపోవసబ్జంబుకై
ఏనాఁడైనఁ బిపాసతో వెడలుచో నే చంపకంబందునో
గానీ వ్రాలఁగఁ బోవ నబ్జమున నా ఖర్మంబో! అజ్ఞానమో!
నేనే మాత్ర మెఱుంగ వేఁడెదను నిన్నే సంగమేశప్రభూ!

వినుమా! ధాతకు బుద్ధి సుంత గలదా! వీక్షింపఁగా మాకు లో
చనముల్ రెంటినొసంగియుండియు పరోక్షంబౌ నిగూఢంబు నే
మన సేలా! యొకటిచ్చె నోడిసను బల్మారుల్ ప్రయత్నింప రెం
టినో మూఁడింటినో! యెన్ని యోయోసఁగఁ బోఁడే సంగమేశప్రభూ!

హృదయోద్యానవనంబునందు సుమమై యీ తేఁటికే వేళలన్
సుధలందీయుననటంచు నెంచితికటా! శోకాల హాలాహలం
బిదిగో గ్రోలుమటంచు నిచ్చినది నేనే తేటికో యంకితం
బది నా యిష్టముగాదు పొమ్మనియె నా హాలాహలజ్వాలలో
బ్రదుకున్ భస్మముచేసికొంటినిఁక దేవా సంగమేశప్రభూ

హృదయం బేలకొసంగినాఁడొసఁగెఁబో యీమోహాసమ్మోహ సం
పదలన్ దేనికొసంగినాఁడొసఁగెఁబో వాణీవిభుం డేల మా
యెదలన్ జిన్నవిజేసెనయ్య చెపుమా! యేమందు క్రీడింపఁగాఁ
జదరంగమునఁ బావునై తిఁ బరమేశా! సంగమేశప్రభూ!

కడలిన్ మున్గెడు వేళ నావమనలన్ గాపాడునానావయే
సుడిగుండంబునఁ గ్రుంకు వేళ కరుణాస్ఫూర్తిన్ గటాక్షింప నో
క్కడవే దిక్కని నమ్మియుంటినిఁక నాకన్నీటినింబాపుమా!
ాడుకుల్ దుఃఖితులౌట సహ్యమగునొక్కో సంగమేశప్రభూ!

శాయత్తప్రమత్తచిత్తుఁడను నే హాస్యాలపాలైతి నా
మాశావార్ధియనన్ను ముంచినది దుఃఖాంభోధిపాలైతి స
ర్వేశా! కేలునొసంగుమయ్య! ననుబాధింపగ యత్నించు నా
యాశన్ బాశములోఁడఁ గట్టఁగదటయ్యా! సంగమేశప్రభూ!

హృదయంబగ్నిరగిల్చి దగ్ధమగుచో నేమందు నద్ధానికై
దియేరీతిని డిగ్గుడిగ్గఁగలదా! యాత్మార్పణారూపమా
ములన్ ద్యాగముసేయుడిగ్గునెడలేన్ నానాప్రకారంబులన్
దియే చేయఁగలాఁడఁ బంక్తిముఖవంద్యా! సంగమేశప్రభూ!

దో బొమ్మను జేసి ప్రాణమును నీవే పోసి యాడింపఁగా
ాదంబైనది నీకుఁ గాక జనులన్ బుట్టింపఁగా నేల నీ
ాధాలాప మనోవికారజగతిన్ బాపాత్మసంభూత వి
దార్థంబు త్రిశూలి పూనుకొనుమా! శ్రీసంగమేశప్రభూ!

పరగేహంబున భోజనంబు రమణీభామామణీ కామినీ
సరసాలాపములందురక్తి సుజన శ్లాఘ్యేతర జ్ఞానమున్
విరసంబైన కవిత్వతత్త్వపథమున్ నిస్సారమా నాల్గిటిం
బరమేశా! ననుఁజేరనీయకుముసుమ్మా! సంగమేశప్రభూ!

పగవారెరికిఁగన్నుకుట్టినను నన్ బాధింప బాధింపనీ
సెగలన్ గ్రక్కినఁగ్రక్కనీ వగవనీ! చీత్కారముల్ సేయనీ
భగవంతుండవు న్యాయపాలకుఁడవై పాలించి రక్షించుచో
జగమందెరికి డిగ్గఁబోను పరమేశా! సంగమేశప్రభూ!

అనిమొక్కండు హితుల్ పరిస్థితులు దుఃఖాంభోధిలోముంప రో
దనలోఁగ్రుంకి కృశించుచుంటఁగని యాత్మన్ మిత్రుడన్ గాన నే
విని తద్వేదన గ్రంథరూపమున నీ విజ్ఞాన లేశంబుతో
ప్రకటింపన్ నినుఁబూనుకొంటి వినరావా! సంగమేశప్రభూ!

నేనీనాడొక వెఱ్ఱిమొఱ్ఱికవినై నీపై కవిత్వంబుకై
పూనన్ ఘంటము సాధుశబ్దసుమముల్ పుష్పించవే సద్రసం
బైనన్ గానిదాయె సత్ఫలమువింకాశింపఁగానేల; నే
మైనన్ భక్తినిజంబటంచెఱుఁగుమయ్యా! సంగమేశప్రభూ!

బాలవ్యాకరణాదులందు ప్రతిభావంతుడనాగాను; కా
వ్యాలోకంబును జేయకుండుటను విద్యావృద్ధియాలేదు నే
లీలల్ సెప్పు పురాణమొక్కటిని వల్లింపన్ బ్రయత్నింప లే
దేలా! యీశతకంబు శ్రావ్యముగునోయీ! సంగమేశప్రభూ!

దోషాదోషవివేచనాపటిమ ప్రాదుర్భావమున్ గామి స
ద్భాషాజ్ఞానములేమి గ్రాంధికవిధిన్ భక్తింబ్రదర్శించి నే
భాషింపంగనులేక పేలవముఁగాఁ బ్రార్థించితిన్ నిన్ను సం
తోషంబైనదొ! నీమనంబునకుఁగాదో! సంగమేశప్రభూ!

నానా వేదనలన్ భరించితిని నే నానాప్రలాపంబులన్
ధానంబున్ సలుపంగఁబూన శతకంబష్టోత్తరంబాయె వి
జ్ఞానంబల్పముగాన దోషములతో సాంకర్యమైయున్న సద్
జ్ఞానంబిచ్చి క్షమింపుముజ్జ్వల యశస్కా సంగమేశప్రభూ

ఏమేమాడినవాడనో పలుకులందేదోషముల్ గల్గెనో
ఏమో! మొరలాలకించుటకునై యేకార్యముల్ వీడితో
యేమో! దుర్వినియోగమాయె సమయంబీ వేళ నంచెంచెదో
యేమో! నన్నుక్షమించి ప్రోవఁగదవోయీ! సంగమేశప్రభూ!

ఉదయంబాదిగ నన్నుఁజేరితివి సూర్యుండింక నస్తాద్రిపై
వెదఁజల్లన్ గిరణంబులఁజనియె నా వేగంబుతో శైత్యుఁడై
విధుఁడాకాశము నంటుచుండె నిఁకనావేళాయెనంచెంచు నా
మదనుండయ్యెడ గారివేచినదిసుమ్మా! సంగమేశప్రభూ

కుముదంబుల్ వికసించువేళ యిదినీకుంబాన్పు వేళాయెనో
యుమకున్ గోపమువచ్చునేమొరతియందుత్కంఠయుష్మద్వియో
గముచేతన్ ద్విగుణీకృతంబగునో సాంగత్యంబువాంఛించు న
య్యుమకున్ దృప్తినొసంగఁజేరుకొనుమయ్యా! సంగమేశప్రభూ!

అసలేరీతినిఁబొందెదీవు రతిసౌఖ్యంబర్ధనారీశ్వరా!
అసలేరీతినిఁబొందెదీవు రతిసౌఖ్యప్రాప్తి గంగాధరా!
అసలేరీతినిఁబొందెదీవు రతిసౌఖ్యంబున్ మనోజారి! యా
పసయేమో యది తెల్పఁగాఁగలవో దేవా! సంగమేశప్రభూ!

జోజో శర్వర! శంకరా! సుఖకరా! జోజో హరా! ఈశ్వరా!
జోజో ధీశయశస్కరా! శశిధరా! జోజో శివాసుందరా!
జోజో శ్రీకర! భీకరా! పురహరా! జోజో మనోభాస్కరా!
జోజో నాగధరా! త్రిశూలధర! జోజో సంగమేశప్రభూ!

స్వస్తింబల్కుము న్యాయమార్గములతోఁ బాలించుభూపాలికిన్
స్వస్తింబల్కుము లోకులెల్లరకు విద్వత్కోటికిన్ నిత్యమున్
స్వస్తింబల్కుము ధేనుసంతతికి విప్రశ్రేష్ఠులౌ వారికిన్
స్వస్తింబల్కుము శాంతిభద్రతలకీశా! సంగమేశప్రభూ!

ఇది కడిమిళ్ళ వంశోద్భవుండును, శేషయాఖ్యుని పౌత్రుండును, వెంకటరామయశాస్త్రి పుత్రుండునగు శ్రీరామచంద్ర వరప్రసాద ప్రణీతంబైన సంగమేశ్వర శతకము సమాప్తము.